నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ గోల్డెన్ టెంపుల్, జవహర్ నగర్ ఫీడర్ల పరిధిలోని శ్రీనివాస కన్‌స్ట్రక్షన్, ఎంపీ అక్బరుద్దీన్ ఓవైసీ ఇళ్లు, జవహర్‌నగర్, కల్యాణ్‌నగర్, మధురానగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ల్యాసిడ్ హాస్పిటల్, కృష్ణానగర్ ఫీడర్ల పరిధిలోని మా టీవీ, సినీమ్యాక్స్ ల్యాసిడ్ ఆస్పత్రి, రహమత్‌నగర్, అమర్ టీ పాయింట్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ అమీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి, బల్కంపేట ప్రధాన రహదారి, సోని వైన్స్ వెనుక ప్రాంతం, కల్యాణ్ నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన రహదారి, కల్యాణ్ నగర్ పార్క్, సారథి కో ఆపరేటివ్ సొసైటీ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ శాంతిబాగ్, బంజారానగర్ ఫీడర్ల పరిధిలోని శాంతిబాగ్, శివబాగ్, కేకే జోన్ ఆస్పత్రి, బంజారానగర్, ఎస్ఆర్టీ నగర్, వినాయక్‌రావు నగర్, శివాజీనగర్, ఆర్కే నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ విషయంలో మహిళా కానిస్టేబుల్, ఆమె సోదరుడితో ఘర్షణకు దిగిన కొందరు వారిద్దరిపై దాడిచేశారు. బంజారాహిల్స్, సయ్యద్‌నగర్‌కు చెందిన జహరారా పర్వీన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. ఈ నెల 2న ఆమె సోదరుడు మహ్మద్ అష్ఫక్ అలీ ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి అతడు వాహనం పెట్టేచోట ఓ సైకిల్ పార్క్ చేసి ఉంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న కొంత మంది అతడిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. సమాచారం అందుకున్న పర్వీన్ అక్కడకు వెళ్లడంతో ఆమెపై కూడా దాడిచేశారు. గాయాలతో ఆస్పత్రిలో చేరిన ఆమె ఈ నెల 5న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

హోంగార్డును బైక్‌తో ఢీకొట్టిన యువకుడిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి హోంగార్డును ఢీకొట్టిన యువకుడిపై కేసు నమోదైంది. చింతల్‌కు చెందిన జి.శ్రీనివాస్ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5న సాగర్‌సొసైటీ చౌరస్తాలో విధుల్లో ఉండగా ద్విచక్రవాహనంపై వచ్చిన మల్కాజిగిరికి చెందిన దివ్యాంష్ భట్టి ఆయన్ను ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్ కాలు విరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డుపై బండరాయితో దాడి

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డుపై బండరాయితో దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెహిదీపట్నంకు చెందిన వెంకటరత్నం సబ్జాకాలనీ సత్వా మాగ్నస్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 4న రాత్రి అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే వైభవ్ బిల్డింగ్ ప్రధాన గేటు వద్ద ఉన్న ట్రాఫిక్ కోన్స్ చూసి సెక్యూరిటీ గార్డును దుర్భాషలాడాడు. అతడిని అడ్డుకునే ప్రయత్నం చేసిన వెంకటరత్నంపై బండరాళ్లు విసిరాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గతవారం సైతం వైభవ్ సెక్యూరిటీ గార్డుపై దాడి చేశాడు. వెంకటరత్నం ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాలో వల.. ఆపై వేధింపులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో యువతులతో పరిచయం పెంచుకొని వారి ఫొటోలను అసభ్యకరంగా మార్చి వేధింపులకు గురిచేస్తున్న బీటెక్ విద్యార్థిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరుకు చెందిన ఎం.రామకృష్ణ బీటెక్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయిలతో చాటింగ్ చేస్తూ వారి ఫొటోలు, వీడియోలు సేకరించి మార్ఫింగ్ చేస్తున్నాడు. వాటిని యువతులకు పంపి తాను చెప్పినట్లు వినాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నగరానికి చెందిన ఓ యువతిని ఇలాగే వేధించడంతో ఆమె సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గుంటూరు వెళ్లి రామకృష్ణను అరెస్ట్ చేసి అతడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం


మొహర్‌రావు

సనత్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లిన కార్మికుడు అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీ స్టేషన్ పరిధిలో జరిగింది. అల్లాపూర్ షాబాద్‌నగర్‌లో నివసించే మొహర్‌రావు (47) ఈనెల 2న పనిచేసే ప్రదేశంలో తన ఆరోగ్యం బాగాలేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తొలిరోజు ఇంటింటికీ స్టిక్కర్లు

ఖైరతాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. తొలిరోజు ఖైరతాబాద్ సర్కిల్‌లో 7,500 ఇళ్లు, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 6 వేల ఇళ్లకు స్టిక్కర్లు వేసినట్లు సర్కిల్ 17 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. మరో రెండు రోజుల పాటు స్టిక్కర్లు వేసి.. అనంతరం 9వ తేదీ నుంచి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

వెంగళరావునగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా ప్రారంభించారు. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ కార్పొరేటర్లు దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్, సీఎన్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తమ పరిధిలో అధికారులతో కలిసి సర్వే ప్రక్రియను ప్రారంభించారు.


నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎన్యూమరేటర్


సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానాతో కలిసి సర్వేను ప్రారంభించిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి


కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ వద్ద సర్వే వివరాలు తీసుకుంటున్న సిబ్బంది


మధురానగర్ కాలనీలో కార్పొరేటర్ దేదీప్య ఇంట్లో వివరాలు సేకరిస్తున్న డీఎంసీ జకీయా సుల్తానా


స్టిక్కర్ అంటిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, అధికారులు


స్టిక్కర్ అంటిస్తున్న యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, అధికారులు


ఇంటింటికి తిరుగుతున్న ఎన్యూమరేటర్లతో సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ కైలాష్

భూగర్భజలాల పెంపుపై అవగాహన

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను మెరుగుపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి జగన్నాథం సూచించారు. రాష్ట్ర భూగర్భ జలశాఖ హైదరాబాద్ జిల్లా, సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్‌లో భాగంగా బుధవారం జవహర్‌నగర్‌లోని అమీర్‌పేటనంబర్-1 ప్రభుత్వ పాఠశాలలో భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ.. నగరంలోని ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భూగర్భ జలాల వినియోగం, వర్షపునీటి వృధాను అరికట్టడం వంటి అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ మండల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శామ్యూల్‌రాజ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగ బ్రహ్మచారి, జియాలజిస్ట్ సంధ్య, హైడ్రోజిస్ట్ వాసు, సూపరింటెండెంట్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెగిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

- ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది


పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎస్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ. పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని అపోలో ఆస్పత్రి వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నాను. త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్వీరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం

కురుమల వృత్తి గొర్రెల కాపరిగా చెప్పాలి

- కురుమలకు ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం సూచన

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో కులం పేరు కురుమగా, వృత్తి గొర్రెల కాపరి అని రాయించుకోవాలని, లేదంటే పిల్లలకు భవిష్యత్తులో అన్యాయం జరుగుతుందని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కురుమలకు సూచించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కులగణన సమయంలో తమను గొల్ల సామాజికవర్గంలో కలుపుతున్నారని, విద్యావంతులు ముందుకు వచ్చి కురుమ అని రాయించాలని కోరారు. ప్రభుత్వం సైతం ఈమేరకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి ఆయన చేశారు. తమ సామాజిక వర్గం సంఖ్య తెలుసుకోవడానికి తామే ప్రత్యేకంగా సర్వే చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, నాయకులు దేవర రాజేశ్వర్, కొండల్ రాజు, కొలుకుల నర్సింహ, క్యామ మల్లేశం, ఎక్కాల కన్నా పాల్గొన్నారు.

మరమ్మతులు కాదు.. తొలగించండి


ట్రాన్స్‌కో అధికారులను అడ్డుకుంటున్న స్థానికులు

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడ వడ్డెరబస్తీలో హైటెన్షన్ వైర్ల వ్యవహారం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. నాలుగు రోజుల క్రితం హైటెన్షన్ వైర్లు తెగిపడటంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ వైర్లను వెంటనే తొలగించాలని స్థానికులు, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ ఇటీవల ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో తెగిపడిన వైర్లకు మరమ్మతులు చేసేందుకు బుధవారం ట్రాన్స్‌కో అధికారులు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. మరమ్మతులు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని.. వెంటనే వీటిని ఇక్కడి నుంచి తరలించాలని ఆందోళన చేపట్టారు. రెండు నెలల్లో తరలిస్తామని అధికారులు చెప్పినా స్థానికులు వినిపించుకోలేదు. పంజాగుట్ట పోలీసులు అక్కడకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు.


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఫుట్‌పాత్ వ్యాపారాలను షేక్‌పేట రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14లోని ఆర్కే కాంప్లెక్స్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గతంలో సినీ పరిశ్రమకు చెందిన వారికి కేటాయించారు. దీనిని వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చేయడంతో వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై కోర్టులో వివాదం నడుస్తుండగా ఇటీవల కొందరు రేకులు, గుడిసెలు వేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీరి నుంచి స్థానిక రాజకీయ నాయకులు అద్దె వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు వాటిని తొలగించారు.


అంబేడ్కర్ వర్సిటీలో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

వర్సిటీలో కొనసాగుతున్న నిరసనలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ప్రత్యేక అంతర్జాతీయ భాషా శిక్షణ ప్రయోగశాఖ కేంద్రాలు అవసరమని వర్సిటీ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. వర్సిటీ న్యాక్-ఏ గ్రేడ్ సాధించిందని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి నిధులు పొందే అవకాశముందన్నారు. విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా అధ్యయనంతో పాటు అంతర్జాతీయ భాషలకు సైతం కోచింగ్ అందించాలని ప్రయత్నం చేపడుతుందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి వర్సిటీ స్థలం కేటాయించొద్దని బుధవారం జూబ్లీహిల్స్ వర్సిటీ ఆవరణలో ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, డా.రవీంద్రనాథ్ సోలమన్, ఎండీ హబీబుద్దీన్, రజనీకాంత్, షబ్బీర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చెక్‌మేట్ కన్సల్టెన్సీ కేసులో ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలో సీట్లు ఇప్పిస్తానని మోసం చేసిన చెక్‌మేట్ కన్సల్టెన్సీ వ్యవహారంలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు రోహిత్ ఓ వ్యక్తి వద్ద ఇంజనీరింగ్ సీటుకోసం రూ.8 లక్షలు తీసుకున్నాడు. మరొకరి వద్ద మెడికల్ సీటు కోసం రూ.3 లక్షలు, ఓ మహిళ వద్ద ఉద్యోగం కోసం రూ.8 లక్షలు తీసుకున్నాడు. మరో మహిళ వద్ద కార్యాలయం ఆధునీకరణ పేరుతో రూ.70 లక్షలు తీసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రోహిత్‌తో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఎ-2గా ఉన్న భవానీశంకర్, ఎ-6గా ఉన్న అచ్యుత్‌సాయిరాంచౌదరిలను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. రోహిత్ కోసం గాలిస్తున్నారు.

స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం.. నలుగురి అరెస్ట్

అమీర్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో నిర్వాహకురాలితో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం కె.సంధ్య (32), కె.నరేష్ (32) భార్యభర్తలు. ఎస్సార్‌నగర్‌లో వి.ఆర్.యూనిసెక్స్ అండ్ స్పా పేరుతో ఓ కేంద్రం నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేంద్రంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు కె.నరేష్ పరారవగా విటులుగా వచ్చిన సంతోష్ దాస్(38), ఎస్.రామరాజు(37)లతో పాటు మరో యువతిని(25) అరెస్ట్ చేశారు.

సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్ట్

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు నిందితులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ముగ్గురు వ్యక్తులు కొండాపూర్‌కు చెందిన మహిళను దుస్తులు ఉతకడానికి అని చెప్పి ఓంనగర్‌లోని తమ రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. పక్క ఇళ్లవారి సహాయంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు మూడు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజాము గచ్చిబౌలిలోని బయో డైవర్సిటీ వద్ద నిందితులు చందు, అజయ్, ఆరిఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


నార్త్ హైదరాబాద్ రూట్లలో మెట్రోను విస్తరించాలంటూ మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి మేడ్చల్-మల్కాజిగిరి బీజేపీ నేతలు ఎస్.మల్లారెడ్డి, విక్రమ్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి


ట్రోఫీతో మైరా

టేబుల్ టెన్నిస్ విజేతగా మైరాజైన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మైరా జైన్ (వైట్ టైగర్ టేబుల్ టెన్నిస్ అకాడమీ) విజేతగా నిలిచింది. హైదర్‌గూడలో జరిగిన ఈ పోటీల్లో బాలికల అండర్-11 విభాగంలో మైరా 3-2తో అవియాహ్‌పై నెగ్గి, టైటిల్ సాధించింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో మైరా 3-0తో యశశ్రీపై గెలిచింది.

కాపర్ వైర్ చోరీ

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖకు చెందిన కాపర్ వైర్ చోరీకి గురైంది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 45లోని జీహెచ్ఎంసీ పార్కు వద్ద ట్రాన్స్‌కో అధికారులు టవర్‌పై కేబుల్ పని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం భారీగా కాపర్ వైర్లను ఉపయోగిస్తున్నారు. కాగా, ఈ నెల 5న టవర్ వద్ద ఉన్న 400 మీటర్ల కాపర్ వైర్ కనిపించకుండా పోయింది. దీంతో ఎర్రగడ్డ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.ప్రసన్నధీరజ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హెచ్‌పీఎస్ విద్యార్థిని ఆకర్షణసతీష్‌కు వాచ్, పుస్తకాలు అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

గవర్నర్‌ను కలిసిన ఆకర్షణసతీష్

సనత్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంత ఖర్చులతో ఇప్పటి వరకు 17 లైబ్రరీలు ఏర్పాటు చేసిన హెచ్‌పీఎస్ విద్యార్థిని ఆకర్షణ సతీష్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. తండ్రితో కలిసి బుధవారం ఆకర్షణ సతీష్ రాజ్‌భవన్‌కు వెళ్లాడు. ఈ సందర్భంగా ఆమెను గవర్నర్ జిష్ణుదేవ్ అభినందించి వాచ్‌తోపాటు పలు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నవంబర్ 25న మూసాపేటలోని సత్యసాయి బాలికల ఆశ్రమంలో 18వ లైబ్రరీని ప్రారంభించేందుకు వస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు.

హిందూ కళాశాలలో పేపర్ ఫ్రీ దినోత్సవం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగితపు వ్యర్థాలను తగ్గించి మరింత పర్యావరణ అనుకూల ప్రపంచాన్ని సృష్టిద్దామని తెలంగాణ కాలుష్య నియంత్రణమండలి పిలుపునిచ్చింది. టీజీపీసీబీ ఆధ్వర్యంలో ప్రపంచ పేపర్ ఫ్రీ దినోత్సవాన్ని సనత్‌నగర్‌లోని హిందూ మహిళా కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీసీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు పేపర్ వాడకం వల్ల కలిగే పర్యావరణ ప్రభావం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా కాగితం ఉత్పత్తి కోసం 35శాతం అటవీ నిర్మూలన జరుగుతుందని, సగటున ఒక ఉద్యోగి సంవత్సరానికి 1,000 పేపర్ షీట్లను ఉపయోగిస్తున్నారని వెల్లడించారు. రికార్డులను డిజిటలైజ్ చేయడం, ఎలక్ట్రానిక్ సంతకాలను వినియోగించడం, డిజిటల్ కమ్యూనికేషన్, లావాదేవీలు, పేపర్ పునర్వినియోగ ఉత్పత్తులను ప్రోత్సహించడం వంటి పరిష్కార మార్గాల ద్వారా కాగితం వృథాను అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రీమా సర్కారీ, పీసీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రేమిస్తున్నానని.. డబ్బు తీసుకుని ముఖం చాటేశాడు

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నాని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతి వద్ద లక్షల రూపాయలు తీసుకొని ముఖం చాటేసిన యువకుడిపై కేసు నమోదైంది. వినోభానగర్‌కు చెందిన యువతి(26) ఓ ప్రైవేటు కంపెనీలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తోంది. అదే కంపెనీలో పనిచేస్తున్న విష్ణుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన విష్ణు అందుకు యువతి తల్లిని సైతం ఒప్పించాడు. ఈ క్రమంలో ఆమె జాబ్ మాన్పించి బ్యాక్‌డోర్ ద్వారా డబ్బు కడితే మంచి జీతం వస్తుందని చెప్పి రూ.14 లక్షలు తీసుకున్నాడు. రూ.4లక్షలు తిరిగి ఇచ్చేసి మిగతా డబ్బు ఇవ్వలేదు. ఈ విషయమై విష్ణు తండ్రిని కలవగా ఆయన వీలైనంత త్వరగా డబ్బు తిరిగి ఇచ్చేస్తామని కేసు పెట్టవద్దని చెప్పాడు. దీంతో యువతి కొద్ది రోజుల తర్వాత విష్ణు ఇంటికి వెళ్లగా రెండు రోజులుగా విష్ణు ఇంటికి రావడం లేదని అతడి తండ్రి చెప్పాడు. ఇద్దరు కలిసే తనను మోసం చేస్తున్నారని గ్రహించిన యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మెట్రో డివైడర్‌ను ఢీకొన్న కారు

మోతీనగర్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా కారు నడిపి మెట్రో డివైడర్‌ను ఢీకొన్న ఘటన బుధవారం తెల్లవారుజామున మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తున్న కారు పిల్లర్ నెంబర్ 1719, 1720 మధ్య డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా.. అక్కడి కేబుల్ వ్యవస్థ సైతం దెబ్బతిన్నది. ఘటన డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మెట్రో అధికారుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయం అందుకున్న దివ్యాంగురాలితో సెవెన్ రేస్ ఫౌండేషన్ డైరెక్టర్ సారా

దివ్యాంగురాలికి సాయం

అడ్డగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలు సంధ్యకు కిరాణ దుకాణం వ్యాపారం నిర్వహించుకోవడానికని ఉప్పల్‌లో డబ్బాతో పాటు కిరాణ వస్తువులన్నీ సాయం చేశామని సెవెన్ రేస్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సారా అన్నారు. దివ్యాంగురాలికి ఎవరూ లేకపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆమెకు సాయం చేశామని సారా తెలిపారు.

13న పెన్షనర్స్ చలో ఢిల్లీ

చిలకలగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు నవంబర్ 13న చలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు తరలిరావాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి నగరం శ్రీధర్ పిలుపునిచ్చారు. రైల్వే ఉద్యోగులు పదవీ విరమణ చేసిన వారు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, 18 నెలల కరువు భత్యం, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదనపు పెన్షన్ 65 సంవత్సరాలకి, పాత పెన్షన్ విధానం అమలు తదితర సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గృహిణి అదృశ్యం



నాగరాణి

అడ్డగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బయటికి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. లాలాగూడ శాంతినగర్‌కు చెందిన నల్ల కిరణ్ భార్య నల్ల నాగరాణి (37) కిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఈనెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లిన నాగరాణి తిరిగి రాలేదు. అదే ప్రాంతానికి చెందిన కిషోర్ శర్మ అనే వ్యక్తి ప్రతి రోజు మాట్లాడేవాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భార్య కోసం తీవ్రంగా గాలించిన భర్త ఇక లాభం లేదని బుధవారం లాలాగూడ పోలీస్ స్టేషన్ లో భార్యపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళ్లిన వ్యక్తి..



మొహర్ రావు

సనత్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లిన కార్మికుడు అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అల్లాపూర్ షాబాద్ నగర్‌లో మొహర్‌రావు (47) కుటుంబంతో కలిసి ఉంటూ సెంట్రింగ్ పనులు చేసున్నాడు. ఈనెల 2న పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. పని ప్రదేశంలో తన ఆరోగ్యం బాగాలేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సికింద్రాబాద్ స్టేషన్ నుంచి దివ్య దక్షిణ యాత్రకు బయల్దేరిన యాత్రికులు

'దివ్య దక్షిణ యాత్ర'కు భారత్ గౌరవ్ రైలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్రకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాటు చేసిన ప్రత్యేక భారత్ గౌరవ్ రైలు బుధవారం సికింద్రాబాద్‌లో ప్రారంభమైంది. ఈ పర్యటనలో ప్రయాణికులు తిరువణ్ణామలై అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు మీదుగా పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ప్యాకేజీని రూపొందించారు. ఈ టూరిస్ట్ సర్క్యూట్ రైలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ తదితర దక్షిణాది రాష్ట్రాల్లోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను కవర్ చేయనుంది. కార్తీకమాసం స్పెషల్ భారత్ గౌరవ్ రైలును సికింద్రాబాద్ స్టేషన్‌లో యాత్రికుల్లో ఒకరైన సోమేశ్వర్(70) జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులకు ఎక్కే/ దిగే సౌకర్యం ఉంది. ఈ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

- వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో తవ్వి ఏడాది అవుతున్నా వేయని రోడ్లు
- గుంతల రోడ్లతో ప్రజల అవస్థ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతలు పడిన రోడ్డుపై నిలిచిన వర్షపునీరు (ఫైల్)

బౌద్ధనగర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలోని పలు ప్రాంతాల్లో రోడ్లను తవ్వి వదిలేశారు. వాటి స్థానంలో కొత్త రోడ్లు నిర్మించకపోవటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో ఏడాది క్రితం సీవరేజీ, తాగునీటి పైపు లైన్ మరమ్మతుల నిమిత్తం రోడ్లను తవ్వారు. కానీ వాటి నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ఎటువంటి రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల సమన్వయలోపంతోనే రోడ్డు పనులు జరగడం లేదని వారు వాపోతున్నారు. పోచమ్మ దేవాలయ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆరు నెలల క్రితం నిధులు మంజూరైనా.. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో నిధులు క్యాన్సిల్ అయ్యాయి. స్థానికులు పలు మార్లు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ మళ్లీ ప్రతిపాదనలు పంపామని చెప్పుతున్నారే తప్పా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు చెబుతున్నారు. కొద్దిపాటి వర్షానికే తవ్వినరోడ్లపై గుంతల్లో వాన నీరు నిలిచిపోతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వారాసిగూడ పోచమ్మ ఆలయ వీధిలో సంవత్సరం క్రితం తవ్వినరోడ్డు

బ్రాహ్మణబస్తీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలో అధ్వానంగా రోడ్లు

సీతాఫల్‌మండి డివిజన్‌లోని బ్రాహ్మణ బస్తీ, శ్రీనివాసనగర్‌కాలనీ, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ ప్రాంతాల్లో రోడ్లపై వెళ్లలేని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు మరింత దారుణంగా తయారయ్యాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన కొన్ని రోజులకే యధావిధిగా తయారవుతున్నాయి. చాలామంది వాహనదారులు, చిన్నపిల్లలు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి.

తవ్వేసిన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం..



వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో సంవత్సరం క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. తవ్వినరోడ్డుపై నిత్యం దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితేచాలు రోడ్డు మీదకు వెళ్లే పరిస్థితి లేదు. రోడ్డును నిర్మించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం.

\- టీపీ కృష్ణ, వారాసిగూడ

వర్షపునీటితో చెరువును తలపిస్తున్న గుంతలు



గుంతల్లో వర్షపునీరు నిల్వ ఉండటంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డుమీదకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. తవ్వినరోడ్డు మరింత ప్రమాదకరంగా మారింది. నూతన రోడ్డు నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవటం బాధాకరం. నూతన రోడ్డు నిర్మించేవరకు పోరాడతాం.

-మద్దెల్ల శ్యాంసుందర్, బీజేపీ మహంకాళి జిల్లా కార్యదర్శి

ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే



బోయిన్‌పల్లి సీతారామపురం కాలనీలో కులగణన సర్వేను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, డిప్యూటీ సీఈవో పల్లవి



సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న పద్మారావుగౌడ్ తదితరులు

బోయిన్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులాల సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే అనుకున్న సామాజిక న్యాయం ప్రతి ఒక్కరికి దక్కుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులాల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కార్యక్రమాన్ని బుధవారం కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని సీతారాంపురం కాలనీలో ఎమ్మెల్యే శ్రీగణేష్ కంటోన్మెంట్ డిప్యూటీ సీఈవో పల్లవి, ఆర్డీవో సాయిరామ్, ఎమ్మార్వో అశోక్‌కుమార్, కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ క్రమంలో స్థానికులకు దరఖాస్తులు అందజేసి సిబ్బందితో ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కంటోన్మెంట్ బోర్డు అధికారులు కూడా కలిసిరావడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానంద్, అజయ్ కుమార్, శ్రీకాంత్, శరత్, గౌతమ్, తరుణ్, స్వాతి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నివాసం మారేడ్‌పల్లిలో కార్పొరేటర్ కుటుంబ సభ్యుల వివరాలను జీహెచ్‌ఎంసీ ఏఎమ్‌సీ గాయత్రీదేవి, యూసీడీ సీఓ యాదయ్య, న్యూమరేటర్ రాధిక సేకరించారు.



కార్పొరేటర్ కొంతం దీపిక నివాసంలో కుటుంబ సర్వే స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది

18రోజులపాటు కులగణన సర్వే

అడ్డగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే అడ్డగుట్ట డివిజన్‌లో నిర్వహించామని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ డీసీసీ జిల్లా చైర్మన్ గంటరాజు సాగర్ అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని కమ్యూనిటీహాలులో సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన సర్వే 18 రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ ఆసీస్ తివారీ వివిధ శాఖల అధికారులతో సర్వే నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సతీష్, సీఈఓ ఉమ, సురేష్, ఎండీ యూసుఫ్, కిషన్ సింగ్, పార్టీ సీనియర్ నాయకురాలు రాంలీల పాల్గొన్నారు.



అడ్డగుట్టలో కుల గణన సర్వే ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు

ప్రజలకు మేలు జరిగితే మంచిదే

బౌద్ధనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను ప్రభుత్వం నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండి టీఆర్‌టీకాలనీలో సమగ్ర కుటుంబసర్వేను జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి అధికారులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన స్టిక్కర్స్‌ను అంటించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం ప్రజలకు ఉపకరించే కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. అంతకముందు ఎమ్మెల్యే కార్యాలయంలో సర్వే నిర్వహణ తీరుతెన్నులపై జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, అధికారులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీతా, ప్రసన్నలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు కరాటే రాజు పాల్గొన్నారు.

1200 స్టిక్కర్లు అతికించిన సిబ్బంది

సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో మొదటి రోజు జీహెచ్‌ఎంసీ సిబ్బంది సీతాఫల్‌మండి డివిజన్‌లో సుమారు 1200 స్టిక్కర్లను అతికించారు. డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో 102 బ్లాకులలో ఈ స్టిక్కరింగ్ కార్యక్రమం చేపట్టారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న సుమారు వందమంది సిబ్బంది టీఆర్‌టీకాలనీ, బీదల బస్తీ, మేడిబావి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి స్టిక్కరింగ్‌ను అతికించారు. మూడురోజులు పాటు ఈ కార్యక్రమం ఉంటుందని అనంతరం ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తామని అధికారులు తెలిపారు.

ఇంటింటి సర్వేలో డిప్యూటీ మేయర్

తార్నాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సామాజిక- ఆర్థిక సర్వే తోడ్పడుతుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం సర్వే, గణాంక అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ తార్నాక పరిసర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు, కుటుంబ ఆదాయం, విద్యాస్థాయి, ఆరోగ్య పరిస్థితులు, ఉద్యోగ సమాచారాన్ని సేకరించి భవిష్యత్‌లో పథకాలు రూపొందించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీ సుభాష్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హేమలత, డీఈ వెంకటేశ్, డీపీఓ శ్రీవాణి పాల్గొన్నారు.



వివరాలను సేకరిస్తున్న సర్వే అధికారులు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

- ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది



పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యు లు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎస్ బండారి వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ.పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపో లో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నా.. త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ రవీందర్‌బాబు పాల్గొన్నారు.

ఇంటివద్దే లైఫ్ సర్టిఫికెట్ అందజేయొచ్చు

చిలకలగూడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్ అందజేసే అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ ఎస్.వివేకానంద్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో అవగాహన పోస్టర్‌ని ఆవిష్కరించి మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగులు పోస్టాఫీస్, బ్యాంకుకి వెళ్లకుండా ఇంటి వద్దనే అందజేసే అవకాశముందని తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబరు నెలలో పెన్షన్ పొందేవారు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. కార్యక్రమంలో ఫైనాన్షియల్ అడ్వయిజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (జి) పి.కోటేశ్వర రావు, రైల్వే అధికారులు డీసీ దివాకర్, ఆనంద్, ఘంటసాల వెంకటేశ్వర రావు ఉద్యోగులుపాల్గొన్నారు.



రైల్ నిలయంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివేకానంద్, కోటేశ్వరరావు

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

మార్కెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్

ఇంటర్వ్యూ



రెజిమెంటల్‌బజార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా బంగారం, వెండి హోల్‌సేల్, రిటేల్ దుకాణాలు ఉన్నాయి. చోరీలు అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

రెగ్యులర్‌గా వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. పరిచయం ఉన్న వర్కర్లను నియమించుకోవాలని చెబుతున్నాం. తప్పనిసరిగా వారి ఆధార్‌కార్డును తీసుకొని భద్రపరచాలని సూచిస్తున్నాం.

నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. కమాండ్ కంట్రోల్ ద్వారా మానిటరింగ్ చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం. నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నాం.

రౌడీ షీటర్‌లు ఎంత మంది ఉన్నారు?

ఇద్దరు ఉన్నారు. బేగంపేట నుంచి వచ్చి ఇక్కడ ఉంటున్నారు. వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి గమనిస్తున్నాం.

గుర్తు తెలియని మృతదేహాల గుర్తింపులో తీసుకుంటున్న చర్యలు

అనాథలుగా ఉన్నవారిని గుర్తించి వారి వేలి ముద్రలు, ఆధార్‌కార్డులు తీసుకుని భద్రపరుస్తున్నాం. గుర్తుతెలియని మృతదేహాల వివరాలు తెలుసుకోవడంలో ఉపయోగపడుతున్నాయి.



హెచ్‌పీఎస్ విద్యార్థినికి వాచ్, పుస్తకాలు అందజేస్తున్న గవర్నర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన ఆకర్షణ సతీష్

సనత్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంత ఖర్చులతో ఇప్పటి వరకు 17 లైబ్రరీలు ఏర్పాటు చేసిన హెచ్‌పీఎస్ విద్యార్థిని ఆకర్షణ సతీష్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. తండ్రితో కలిసి బుధవారం ఆమె రాజ్‌భవన్ చేరుకున్నారు. ఇప్పటి వరకు 17 కమ్యూనిటీ లైబ్రరీలను ఏర్పాటు చేసిన ఆమెను గవర్నర్ అభినందించారు. లైబ్రరీ కార్యక్రమాలకు గుర్తింపుగా ఆకర్షణ సతీష్‌కు వాచ్‌తోపాటు ఎంపిక చేసిన పుస్తకాలను గవర్నర్ అందించారు. ఈ సందర్భంగా నవంబర్ 25న ఉదయం 11.30 గంటలకు మూసాపేటలోని శ్రీ సత్యసాయి బాలికల అనాథ ఆశ్రమంలో ప్రారంభించనున్న 18వ లైబ్రరీని ప్రారంభించేందుకు వస్తానని గవర్నర్ ఆమెకు హామీ ఇచ్చారు.



శ్రీ లక్ష్మీ నారాయణ స్వామికి అన్నకూట్‌లో నివేదన చేస్తున్న అర్చకులు

110 ఏళ్లుగా దేవస్థానంలో 'అన్నకూట్'

రాంగోపాల్‌పేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని 110 సంవత్సరాల పురాతన శ్రీ లక్ష్మీనారాయణ దేవస్థానంలో బుధవారం అన్నకూట్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. పోటు (వంటశాల)లో అన్నకూట్ కార్యక్రమంలో భాగంగా పోటులో వండిన పులిహోర, లడ్డూ, బూందీ, దద్దోజనం, క్షీరాన్నం, వడలు, అరిసెలు తదితర నైవేద్యాలను స్వామి వారికి నివేదించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ నైవేద్యాన్ని భక్తులకు శాత్తుమురై గోష్ఠిలో వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కొమ్మాలు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు వెయ్యి మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అనువంశిక ధర్మకర్తల సహకారంతో అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్ మాట్లాడుతూ.. ఈ ఆలయంలో నూట పది సంవత్సరాలుగా ప్రతి కార్తీక శుద్ధ పంచమి నాడు ఇలా స్వామి వారికి అన్నకూట్ నిర్వహిస్తున్నామన్నారు.

మరో కొత్త ఫుడ్ డెలివరీ యాప్

రెజిమెంటల్‌బజార్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంటు యజమానులకు, కస్టమర్లకు ప్రయోజనం చేకూరేవిధంగా వాయు జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు వాయు యాప్ వ్యవస్థాపకులు మందర్ లాండే, అనిరుధ కోట్‌గిరే తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో వాయు ఫుడ్ డెలివరీ యాప్‌ను ప్రారంభించారు. కస్టమర్లకు తక్కువ ఖర్చుతో ఆహారాన్ని ఇంటి వద్దకే పంపించడానికి యాప్‌ను హైదరాబాద్‌కు విస్తరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదారాబాద్ హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రామమూర్తి పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్

సైబర్ నేరగాళ్లున్నారు.. జాగ్రత్త

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, సైబర్ క్రైమ్ డీఎస్పీ అనుముల శ్రీనివాస్ రైలు ప్రయాణికులకు సూచించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ప్రయాణికులకు సైబర్ నేరగాళ్ల నుంచి ఎదురయ్యే ఇబ్బందులు ట్రంక్ కాల్స్‌లు, మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల తీరుపై రైలు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ అకౌంట్ వివరాలు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, మీ పేరు ఇతరత్రా వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. ఏ బ్యాంకు మేనేజర్లు కూడా ఖాతాదారులకు ఇలా ఫోన్ చేసి వివరాలు అడగరని తెలిపారు. సైబర్ నేరగాళ్లకు ఓటీపీ నెంబరు చెప్పినట్లయితే అకౌంట్‌లో ఉన్న డబ్బులు కాజేస్తారని అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు వివరాలు అడిగితే ఆ నెంబరు రాసుకుని టోల్ ఫ్రీ 1930 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వే ఎస్సై మజీద్‌తో పాటు సైబర్ క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.